క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మాలమహాసేన జిల్లా కార్యదర్శి పండు

దెందులూరు: కూటమి నాయకులు దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తల పెన్షన్లను తొలగించడమే కాకుండా వేధించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఏలూరు జిల్లా మాల మహాసేన జిల్లా కార్యదర్శి వైఎస్సార్‌సీపీ నేత గంట విజయ్‌కుమార్ (పండు) మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలిసినట్టు పండు తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో దళితులు, బడుగు, బలహీన వర్గాలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడటం, పెన్షన్లు తొలగించడం వంటివి గతంలో లేవని వివరించామని పండు తెలిపారు. అన్ని సర్దుకుంటాయని, బాధితులందరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారని గంట పండు వివరించారు.

శ్రీనివాస్‌కు టీచర్స్ అసోసియేషన్ పదవి



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా గోపన్నపాలెం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాస్ నియమితులయ్యారు. బుధవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జాస్మిన్, ఉపాధ్యాయులు రేఖ, లావణ్య, తులసి, రామకృష్ణ, వేదకుమార్, బుల్లియ్య రాంబాబు ఆయనను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సంఘ అభివృద్ధి సమస్యల పరిష్కారానికి దశాబ్దాలుగా మాసగిరి శ్రీనివాస్ చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా నియమించారని ఉపాధ్యాయులు అన్నారు.

పశువైద్యశాలలో తనిఖీ



పెదపాడు పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ డీడీ

పెదపాడు: వైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలను అందించాలని పశుసంవర్ధక శాఖ డీడీ గోవిందరాజులు తెలిపారు. బుధవారం పెదపాడు పశు వైద్యశాలలో గోవిందరాజులు వార్షిక తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు.సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యురాలు వాణీ సంధ్య, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి ఫణికుమార్, సోము పాల్గొన్నారు.

కూరగాయల రైతు కుదేలు

- తెగుళ్లతో నాశనమవుతున్న పంటలు
- పడిపోయిన దిగుబడి
- తిరిగిరాని పెట్టుబడి



చీడ పీడలతో పాడైన దొండ పాదులు

పెదవేగి : ఒక పక్క వాతావరణం మేఘావృతమైన పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం, ఉన్నట్టుండి కురుస్తున్న చినుకులు, రాత్రి, తెల్లవారు జామున కమ్ముకుంటున్న మంచు కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల కూరగాయల పంటలకు తెగుళ్లు సోకి దిగుబడి పడిపోయి రైతులు కుదేలవుతున్నారు. దెందులూరు నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 6 వేల ఎకరాల్లో రైతులు వివిధ కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. దొండ, బీర, బెండ, ఆనప, వంగ, అరటి తదితర కూరగాయల పంటలు పండిస్తున్నారు. గోంగూర, తోటకూర, కొత్తిమీర తదితర ఆకుకూరలను కూడా పండిస్తున్నారు. ఈ పంటలన్నీ వాతావరణ మార్పుల ప్రభావంతో దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెట్టుబడి భారం అధికమవుతోందని పంట ఉత్పత్తులకు ధర తక్కువ ఉంటోందని రైతులు వాపోతున్నారు.

కూరగాయల సాగుకు ముందు దుక్కి విత్తనం విత్తటం, మొక్కలు నాటడం, వాటి ఎదుగుదలకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. ఎకరం విస్తీర్ణంలో రూ.80 వేల పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. వంగకు రూ.50 వేలు ఖర్చు చేస్తే, 2 నెలల తర్వాత ఆదాయం వస్తుంది. దొండ పంటకు రూ.70 వేలు, ఆనప సాగుకు రూ.25 వేలు ఖర్చవుతోంది. ఎకరా బీర పంట నుంచి ప్రతి రోజూ 50 కేజీల దిగుబడి రావాలి, కాని 20 రోజులకు 10 నుంచి 25 కేజీల దిగుబడి మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. కాయ ఎదుగుదల లేక, పూత రాలిపోయి దిగుబడిపై ప్రభావం పడుతోంది. కూరగాయల ధరలు మార్కెట్‌లో కేజీకి రూ.10 నుంచి రూ.45 ఉండగా, పండించిన రైతుకు మాత్రం కేజీకి రూ.5 నుంచి రూ.12 మాత్రమే దక్కుతోంది. ఆరుగాలం శ్రమించినా ధర రాకపోవడంతో రైతుల శ్రమ వృథా అవుతోంది. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వారు ఎకరం భూమికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ కౌలు చెల్లించడంతో పాటు పంటల సాగుకు కూడా పెట్టుబడి పెట్టాలి. పంటలకు తెగుళ్లు సోకడంతోపాటు ధర రాకపోవడంతో వారు మరింత నష్టపోతున్నారు. కూరగాయలు నాసిరకంగా ఉంటున్నాయని దళారులు సాకుగా చూపి రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా రైతులకు వ్యవసాయ అధికారులు ఎటువంటి సూచనలూ అందించడంలేదు. దీంతో రైతులకు ఎరువులు పురుగు మందుల దుకాణాదారుల సూచనలే దిక్కవుతున్నారు.

తెగుళ్ల ప్రభావం

- దొండ, బీర, వంగ, కాకరకాయలకు వైరస్ సోకింది.
- వర్షపు నీరు నిల్వ ఉండటంతో దొండపాదులు కాండం ఎండిపోయి, పాదు మొదళ్లకు తెగుళ్ల వస్తున్నాయి. ఆకు మాడిపోయి, కాయ ఎదగడం లేదు. ఉన్నకాయలు రాలిపోతున్నాయి.
- ఆకుముడత తెగులుతో బీరకాయలు చిరు దశలోనే రాలిపోతున్నాయి.
- వంగ పంటకు తెగుళ్ల సోకి కాయలు ఎదగడం లేదు. పెరిగిన కాయలకు పుచ్చులొస్తున్నాయి.
- బెండ, ఆనప కాయలు సరిగా ఎదగడం లేదు. లేత దశలో ఉన్న కాయలను మార్కెట్‌కు తరలిస్తే రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు.

నష్టపోతున్నాం

కూరగాయల రైతులు నష్టపోతున్నారు. న్యాయమైన ధర రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం. తెగుళ్లు, నకిలీ విత్తనాల కారణంగా నష్టాలొస్తున్నాయి. దొండ, బెండ, గోంగూర, వంగ పంటల్లో నకిలీ విత్తనాలు ఎక్కువగా వస్తున్నాయి. – కొలికిపాముల లాజరు, జగన్నాథపురం, రైతు

గిట్టుబాటు ధర, బీమా ఇవ్వాలి

కూరగాయలకు గిట్టుబాటు ధర ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రైతు బజార్లు మాత్రమే చాలవు. కూరగాలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి. పంట నష్టానికి బీమా వర్తింపజేయాలి.

– మెట్లపల్లి సూరిబాబు, కూచింపూడి, రైతు

వైభవంగా లక్షపత్రి పూజ



ఉంగుటూరులో భీమేశ్వరుడికి లక్షపత్రి పూజ

ఉంగుటూరు: ఉంగుటూరు పార్వతీ భీమేశ్వర స్వామికి బుధవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. వినాయకునికి విశేష పూజలు నిర్వహించారు. ఉప సర్పంచి పాతూరి జగదీష్, బీజేపీ నాయకుడు కొరిపల్లి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన లక్షపత్రి పూజలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తిమ్మన్నగూడెంలో అయ్యప్ప పడి పూజ

దెందులూరు: చల్ల చింతలపూడి శివారు తిమ్మన్నగూడెంలోని రామాలయం వద్ద అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పడి పూజ వైభవంగా నిర్వహించారు. అరటి దొప్పలు, పూలమాలలలో 8 మెట్లతో మందిరాన్ని నిర్మించి అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



పూళ్లలో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న వైద్యులు ఎం.హరిక్కష్ణ

భీమడోలు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని పలువురు వక్తలు అన్నారు. పూళ్ల, భీమడోలు శాఖా గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి. పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి అధ్యక్షతన బహుమతి ప్రధానోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలకు ముఖ్య అతిథులుగా వెటర్నరీ వైద్యులు ఎం.హరికృష్ణ, ఐ.రమ్యశ్రీ, హెచ్‌ఎంలు పి.భువనేశ్వరరావు, గారపాటి సునీత తదితరులు హాజరయ్యారు. గ్రంథాలయాల ప్రాధాన్యతను వారు విద్యార్థులకు వివరించారు.అనంతరం పూళ్ల, గుండుగొలను వారోత్సవాల్లో విజేతలైన 200 మంది విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో మురళీ, ప్రిన్సిపల్స్ జీవీ గిరిధర్, ఎం.ఈశ్వరరావు, ఆంజనేయులు, గేదెల సురేష్, శ్రీలక్ష్మి, అభివృద్ధి కమిటీ సభ్యులు వీవీఎస్ ప్రభాకరరావు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పెదపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి, ఎంఈఓ 2 డీవీ రమణ, నర్రా సుబ్రహ్మణ్యం, జి పుల్లయ్య నాయుడు, బీ వంశీమోహన్, గ్రంథపాలకుడు డీ జాన్‌బాబు, ఐ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదివి ఉద్యోగానికి ఎంపిక

ఉంగుటూరు: గ్రంథాలయంలో చదవడం వల్లనే తాను ఉద్యోగం సాధించానని ఉంగుటూరు ఎంపీడీవో రాజీమనోజ్ అన్నారు. బుధవారం ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిజిటల్ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వెటర్నరీ డాక్టర్ శిరీష వివరించారు. మాజీ సర్పంచి దొంతంశెట్టి సత్యనారాయణ, ఆయుర్వేద డాక్టర్ శిరీష, తల్లాప్రగడ భీమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవిచంద్రకుమార్, గ్రంథ పాలకుడు గంగాధరరావు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు పంచారు. నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయం వారోత్సవాలు ముగింపు సమావేశంలో ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు, లైబ్రేరియన్ గాబ్రియేలు పాల్గొన్నారు.



పెదపాడు గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్



ఉంగుటూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బాలికల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు



పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్

భీమడోలు: బాలికల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో బుధవారం రాత్రి అంతర్జాతీయ బాలల హక్కు వారోత్సవాల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు ప్రిన్సిపల్ వీవీ రమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ టి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లు, మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ తదితర అంశా లను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా అభయ మహిళా రక్షక దళం పని చేస్తుందన్నారు. బాలికలను సంరక్షించే విషయాల్లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్సై క్రాంతిప్రియలు బాలికలు అపరిచితుల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. తొలుత పదో తరగతితో అత్యధిక మార్కులు పొందిన వెన్నెల అనే విద్యార్థిని అభినందించిన డీఎస్పీ ఆయన పక్క సీటులో కూర్చోబెట్టుకున్నారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్, సీడీపీవో కేవీ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నత్తానియేలు

దెందులూరు: విద్యార్థులు క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని గోపన్నపాలెంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నత్తానియేలు అన్నారు. బుధవారం వ్యాయామ కళాశాలలో వాలీబాల్ పోటీలను ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వాలీబాల్ బాలురు విభాగంలో మొదటి మ్యాచ్‌లో రవికుమార్ జట్టు, మేజర్ ధ్యాన్‌చంద్ జట్టు తలపడ్డాయి. రవికుమార్ టీం విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో మిథాలి రాజ్ జట్టు, పీవీ సింధు జట్టు తలపడగా పీవీ సింధు జట్టు విజయం సాధించారు. రెండో మ్యాచ్‌లో పోటీల్లో బాలుర విభాగంలో మిల్కా సింగ్, శ్రీ జేస్సీ జట్లు పోటీ పడగా మిల్కా సింగ్ జట్టు విజయం సాధించింది. బాలిక విభాగంలో హిమదాస్ వర్సెస్, సైనా నెహ్వాల్ జట్లు తలపడగా సైనా నెహ్వాల్ విజయం సాధించింది. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను దెందులూరు మండలం టీడీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మాగంటి తారకదుర్గ నారాయణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ నత్తానియేలు అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మారగాని సత్యనారాయణ,టీడీపీ, జనసేన నాయకులు, కళాశాల ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దిలీప్ సొంగా, వ్యాయామ ఉపాధ్యాయులు రత్నబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల జాడ లేదు

భీమడోలు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాయంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని, కూటమి ప్రభుత్వంలో సంక్షేమాన్ని నిలుపుదల చేసి ఊరూరా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ భీమడోలులో బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి నాయకులు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చదువుకుంటున్న పిల్లందరికీ అమ్మకు వందనం ఇస్తామని, అర్హులైన ప్రతి మహిళకు రూ.1,500 అందిస్తామని ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందన్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. వలంటీర్లకు రూ.10వేలు వేతనం ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఆ వ్యవస్థలో వారు లేరని చెప్పడం వారి దుర్మార్గమన్నారు. అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పి కూటమి నాయకులకు ఆదాయ వనరుగా బెల్ట్ షాపులు ఊరూరా ఏర్పాటు చేసిశారని విమర్శించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు: పెదపాడు కలపర్రు సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 22న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. స్థానిక పెదపాడు సెక్షన్ పరిధిలోని 33/11కేవీ పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెదపాడు ఫీడర్ 33/11కేవీ కలపర్రు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 22న శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అంబేడ్కర్ తెలిపారు. పెదపాడు, కలపర్రు సబ్ స్టేషన్ పరిధిలోని పెదపాడు నాయుడుగూడెం, కలపర్రు, వట్లూరు, రాఘవ ఎస్టేట్, ఇంద్రప్రస్థ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎ.గోకవరం, కైకరంలో..

ఉంగుటూరు: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ అంబేద్కర్ తెలిపారు. గోకవరం సబ్‌స్టేషన్లు పరిధిలో ఎ.గోకవరం, కైకరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

విద్యార్థి దశ ఎంతో విలువైనది

గణపవరం: విద్యార్థి దశ ఎంతో విలువైనదని, చెడు అలవాట్లు, వ్యసనాలతో దానిని పాడు చేసుకోవద్దని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు రాష్ట్ర పోలీసు శాఖ మహిళల రక్షణ కోసం అభివృద్ధి చేసిన వ్యవస్థ అభయపై అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్‌టీజింగ్, మద్యపానం, జూదం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు, కోఆర్డినేటర్ స్వరూప రాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని, చిన్నతనం నుంచే పరిశుభ్రతపై అవగాహన కలిగిఉండాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. గణపవరం మండలం కాశిపాడులో వైద్య సిబ్బందితో కలిసి పరిశుభ్రత ఆరోగ్యంపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందితే టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపీడీవో తనిఖీ



ఉంగుటూరు సచివాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో మనోజ్

ఉంగుటూరు: సచివాలయాల ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజీమనోజ్ అన్నారు. పరిశీలించారు. బుధవారం ఆయన ఉంగుటూరు, వెల్లమిల్లి సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరును ఆయన పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు రికార్డును పరిశీలించారు. ఇంటింటా సర్వే, పశుగణన సర్వే ప్రక్రియను పరిశీలించారు.

ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్

దెందులూరు : ఫుడ్ పాయిజన్ వల్ల దెందులూరు మండలం జోగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. వారంతా ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారిని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ పరామర్శించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు డీఈవో తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్ : మద్యానికి బానిసై కుటుంబానికి దూరమై జీవితంపై విరక్తి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పు వీధి గౌరీ దేవి గుడి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ సజనకు (37) భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గోనె సంచుల పనికి వెళ్తూ ఉంటాడు. మనస్పర్థల కారణంగా కొంత కాలం క్రితం అతని భార్య పుట్టింటికి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న సజన జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం ఇరుగుపొరుగు వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని తల్లి షేక్ వకలాబి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.